# పల్లెల్లో గాడి తప్పిన పాలన

■ సర్పంచ్‌లు లేక సమస్యలతో ప్రజలు సతమతం ■ ప్రత్యేక అధికారుల పాలనలో ఆగిన అభివృద్ధి



దుద్యాల మండల పరిషత్ కార్యాలయం.

బొంరాస్‌పేట, మే 19: గ్రామపంచాయతీల్లో పాలన రోజురోజుకు గాడి తప్పుతోంది. పల్లెలు దేశానికి పట్టుగొమ్మలు అని, గ్రామాలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుంది అంటారు. కానీ నేడు గ్రామాల్లో సర్పంచ్‌లు లేకపోవడంతో అభివృద్ధి పనులు ఆగిపోయాయి. పంచాయతీ కార్యదర్శులపై ఆర్థికభారం పెరిగిపోవడంతో వారు సమస్యలపై దృష్టి పెట్టలేకపోతున్నారు. స్థానిక సంస్థలకు ఎన్నికలు జరగక పోవడంతో పంచాయతీలు పట్టుతప్పుతున్నాయి. పరిపాలనకు ప్రధానమైన ప్రజా ప్రతినిధులు లేకపోవడంతోపంచాయతీలలో సమస్యలను చూసేవారే కరువయ్యారువార్డు సభ్యులు, సర్పంచ్‌లు, జడ్పీటీసీలు లేకపోవడంతో మౌళిక వసతుల కల్పన, గ్రామాల్లో ఉన్న సమస్యల పరిష్కారం అగమ్యగోచరంగా తయారయ్యింది. గత 15నెలలుగా సర్పంచ్‌లు లేకపోవడంతో ప్రత్యేక అధికారుల పాలన కొన సాగుతున్నది. సకాలంలో ఎన్నికలు నిర్వహించకపోవడంతో 15వ ఆర్థిక సంఘం నిధులను నిలిపివేసింది. దేశంలోనే సర్పంచ్‌లు లేని రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది.

### పంచాయతీ కార్యదర్శులపై ఆర్థికభారం

ఉమ్మడి మండల పరిధిలో 47 గ్రామాల్లో సర్పంచ్‌లు గత సంవత్సరం ఫిబ్రవరి 2వ తేదీ వరకు పరిపాలన కొనసాగించారు. వారి హయంలో నిర్వహించిన పనులకు ముందుగా వారు సొంత డబ్బులను ఖర్చుచేసి పనులను పూర్తిచేసేవారు ఆ తర్వాత చేసిన పనులకు బిల్లులు తీసుకునేవారు.సర్పంచ్‌ల పదవీకాలం పూర్తి అయినప్పటి నుంచి నేటి వరకు 15నెలలుగా పూర్తికావడం సర్పంచ్‌ల పనిభారం మొత్తం కార్యదర్శులపై పడింది.గ్రామాల్లో ప్రధానంగా మురుగుకాలువలను శుభ్రంచేయడం, వీధిదీపాల ఏర్పాటు, కార్మికుల వేతనాలు,ట్రాక్టర్ నిర్వహణ,డీజిల్ ఖర్చులు, నర్సరీల్లో మొక్కల పెంపకం, తాగునీరు సరఫరా, ట్యాంకుల శుభ్రత, మిషన్‌భగీరథ నీటి సరఫరా, సింగిల్ ఫేజ్ మోటార్ల నిర్వహణ వంటి అనేక పనులకు పంచాయతీ కార్యదర్శులే తమ సొంత డబ్బులు సుమారు ఐదులక్షల వరకు ఖర్చుచేయడంతో వారిపై ఆర్థికభారం పెరిగిపోయింది.

### నిలిచిన 15వ ఆర్థిక సంఘం నిధులు

గ్రామపంచాయతీలకు రావాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులు స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించకపోవడంతో నిలిచిపోయాయి.గ్రామాల్లో ఉన్న జనాభాకు అనుగుణంగా ఈ నిధులను ప్రతి సంవత్సరం గ్రామాలకు విడుదల చేస్తారు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల నుండి రావాల్సిన నిధులు కూడా పెండింగ్‌లో ఉండడంతో పంచాయతీ కార్యదర్శులపై ఆర్థికభారం పడుతోంది. తాము గ్రామాలలో చేసిన పనులకు బిల్లులు రావపోవడంతో ఆర్థికభారం పెరగడంతోపాటు వడ్డీల భారం పెరిగిపోతున్నాయని అందోళన చెందుతున్నారు.గ్రామపంచాయతీ కార్యదర్శులు చేసిన పనులకు ఉన్నత అధికారులు చొరవ తీసుకోని నిధులు విడుదల చేసేందుకు చర్యలు తీసుకోవాలని కార్యదర్శులు కోరుతున్నారు.

### పెరుగుతున్న సమస్యలు



గత 15 నెలలుగా స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించక పోవడంతో గ్రామాల్లో సమస్యలు పెరుగుతున్నాయి.ప్రభుత్వం వెంటనే సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించి గ్రామాలను అభివృద్ధి చేయాలి. బీఆర్‌ఎస్ పాలనలో గ్రామాలు పచ్చదనంతో ఉండడంతోపాటు సీసీరోడ్లు, మురుగు కాలువలు, వీధిదీపాలు, పార్కుల అభివృద్ధి వంటి అనేక పనులను గ్రామాల్లో నిర్వహించారు. గ్రామపంచాయతీలలో నిధులు లేకపోవడంతో కార్యద ర్శులు అప్పులుచేసి పనులు నిర్వహిస్తున్నారు.
**–నెహ్రూ నాయక్ బొట్లోనితండా, బొంరాస్‌పేట.**

### త్వరగా ఎన్నికలు నిర్వహించాలి



ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిన గ్రామపంచాయతీ ఎన్నికలను త్వరగా నిర్వహించి గ్రామాల్లో ప్రత్యేక అధికారుల పాలన తొలగించి వార్డు, సర్పంచ్‌ల పరిపాలనను కొనసాగించాలి. గ్రామాల్లో ఉన్న సమస్యలు స్థానికం గా ఉండే సర్పంచ్, వార్డు సభ్యులకు మాత్రమే తెలుస్తాయి కానీ ప్రత్యేక అధికారులకు ఎలా తెలుస్తాయి. ఎన్నికలు నిర్వహించి గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలి.
**– రవీందర్ మాలేకాడిబావి, బొంరాస్‌పేట**






ధారూరు మండల పరిధిలోని ధర్మాపూర్, కొండాపూర్‌కలాన్ గ్రామాల్లో సోమవారం సాయంత్రం ఒక్కసారిగా వర్షం కురవడంతో కొండాపూర్‌కలాన్, ధర్మాపూర్ గ్రామాల మధ్యగల వాగు పొంగిపొర్లింది. మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో వరి ధాన్యం ఆర బెట్టుకున్న రైతులు ఇబ్బంది పడ్డారు. వర్షం కురవడంతో అడుగంటిన భూగర్భజలాలు పైకి వచ్చే అవకాశం ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు. – ధారూరు, మే 19

## ట్రాఫిక్ రూల్స్ పాటించాలి



కులకచర్ల, మే 19: వాహన దారులు తప్పని సరిగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని కులకచర్ల ఎస్‌ఐ రమేశ్ అన్నారు. సోమవారం కులకచర్ల పోలీస్‌స్టేషన్ దగ్గర రోడ్డుపైన వాహనదారులకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలను వాహనదారులు తప్పని సరిగా పాటించాలని సూచించారు. బైక్ నడిపేవారు హెల్మెట్‌ను ధరించాలని, డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలని, ట్రిపుల్ రైడింగ్ చేయకూడదని అన్నారు. వాహనం నడిపేవారు సీటుబెల్ట్ పెట్టుకోవాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడపరాదన్నారు. రూల్స్‌కు విరుద్ధంగా వ్యవహరిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## నష్టపరిహారం చెల్లింపులో ఎందుకు జాప్యం?



సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీనివాస్

యాలాల ,మే19 : తాండూరు పట్టణంలో బైపాస్ కోసం పేద ప్రజల నుంచి ప్రభుత్వం స్థలాలు తీసుకోవడంలో చూపిన తొందర నష్టపరిహారం చెల్లింపులో ఎందుకు చూపడం లేదో తెల పాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం తాండూరు పట్టణంలోని సబ్ కలెక్టర్, సబ్ డివిజనల్ మెజిస్ట్రేట్ కార్యలయంలో బైపాస్ రింగ్ రోడ్డు కోసం భూమి కోల్పోయిన పేదలకు వెంటనే ప్రభుత్వం తగిన నష్టపరిహారం చెల్లించాలని సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పేద ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని చెప్పే కాంగ్రెస్ ప్రభుత్వం తాండూరు పట్టణంలో బైపాస్ రింగ్ రోడ్డు కోసం కోకట్, అంతారం, చెంగోల్‌తో పాటు మిగిలిన గ్రామాల్లో దౌర్జన్యంగా పేదల స్థలాలను తీసుకొందన్నారు. ఇలా తీసుకొన్న స్థలాలకు నష్టపరిహారం చెల్లించకుండా భూబాధితులకు తీవ్ర అన్యాయం చేస్తున్నదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి భూబాధితులకు నష్టపరిహారం చెల్లించాలన్నారు. ఇంకా కాలయాపన చేస్తూ భూబాధితులను ఇబ్బందులకు గురిచేస్తే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరిస్తున్నామన్నారు.

## మిషన్ భగీరథ పైప్ లైన్ లీకేజీలకు మరమ్మతులు


పనులను పరిశీలిస్తున్న పంచాయతీ కార్యదర్శి సాహెరా బేగం

దోమ, మే 19: మండల పరిధిలోని శివారెడ్డిపల్లి గ్రామంలో మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీ కారణంగా గ్రామస్తులకు ఇబ్బందులు ఎదురవుతుండటంతో సోమవారం మరమ్మతులు పూర్తి చేసినట్లు పంచాయతీ కార్యదర్శి సాహెరా బేగం తెలిపారు. గ్రామంలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## రెవెన్యూ సదస్సుకు 47 ఫిర్యాదులు


బురుగుగడ్డ(నాగసముందర్) గ్రామ రెవెన్యూ సదస్సులోమాట్లాడుతున్న ధారూరు డిప్యూటీ తహసీల్దార్ విజయేందర్

ధారూరు మే 19: మండలంలో భూ భారతి రెవెన్యూ సదస్సుకు మొత్తం 47 ఫిర్యాదులు వచ్చినట్లు ధారూరు తహసీల్దార్ సాజిదాబేగం అన్నారు. సోమవారం మండల పరిధిలోని నాగసముందర్, బురుగుగడ్డ, రుద్రారం గ్రామాల్లో భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహిం చారు. నాగసముందర్ లో 36 ,బురుగుగడ్డలో 2, రుద్రారం గ్రామ రెవెన్యూ సదస్సులో 9 ఫిర్యాదులు వచ్చాయి. మంగళవారం చివరి రోజు మండల పరిధిలోని ధారూరు, రాంపూర్, గట్టేపల్లి గ్రామాల్లో భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల రైతులు, ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్లు శ్రీనివాస్, దీపక్ సంసాన్ , డిప్యూటీ తహసీల్దార్లు విజయేందర్, అనిల్‌బాబు, అధికారులు మహేశ్, ప్రకాశ్, శ్రీహరి, గోవర్ధన్, శ్వేత, ఎంపీ హనుమంతు, నరేందర్, సాయి కిరణ్, మాధవరెడ్డి, నరేశ్, జగదీశ్, రవికిశోర్, స్వప్న, శ్రీనివాస్, శివయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## అందరికీ ఆదర్శనీయుడు 'పుచ్చలపల్లి'


పరిగి: పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య


బొంరాస్‌పేట: సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకుడు బుస్సచంద్రయ్య తదితరులు

పరిగి, మే 19: కమ్యూనిస్టు యోధుడు పుచ్చలపల్లి సుందరయ్య జీవితం అందరికీ ఆదర్శనీయమని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.వెంకటయ్య పేర్కొన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి సందర్భంగా సోమవారం పరిగిలో ఆయన చిత్రపటానికి సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.వెంకటయ్య పూలమాల వేసి నివా ళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సుందరయ్య శ్రమ దోపిడీపై, కుల వివక్షతపై చిన్న నాటి నుంచే, తన ఇంటి నుంచే పోరాటం కొనసాగించారని తెలిపారు. సుందరయ్య మంచి పోరాట యోధుడితో పాటు మంచి నిర్మాణదీక్షకుడని పేర్కొన్నారు. కమ్యూనిస్టు పార్టీ నిర్మాణంలో ఆయన కీలకపాత్ర పోషించారన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎం.డి.హబీబ్, రఘురాం, లాలప్ప, అయూబ్, అమీర్, గోపాల్, అనిల్, రాము తదితరులు పాల్గొన్నారు.

**బొంరాస్‌పేట:** దుద్యాల మండల కేంద్రంలో కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి వేడుకలను సీపీఎం పార్టీ నాయకులు బుస్స చంద్రయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలవేసి నివాళులు అర్పించారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమం,వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో ఉద్యమమే ఊపిరిగా ఆశయాలే గీటురాయిగా బతికిన వైతాళికుడు సుందరయ్య అన్నారు. నిజాం నవాబులకు వ్యతిరేకంగా పోరాటంచేసి 10లక్షల ఎకరాల భూములను పేదలకు పంపిణీ చేసిన యోధుడు, తన ఆస్తులు,భూములను పేదలకు దానంచేసిన గొప్పవ్యక్తి అన్నారు. కార్యక్రమంలో రాములు, రాజు, శ్రీనివాస్, దాదుమియా తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ బియ్యం పట్టివేత



కులకచర్ల, మే 19 : అక్రమంగా తరలిస్తున్న ఐదు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు కులకచర్ల పోలీసులు తెలిపారు. నమ్మదగిన సమాచారం మేరకు చౌడాపూర్ మండల కేంద్రంలో రైడ్ చేయగా చింతచెట్టి చంద్రశేఖర్ అనే వ్యక్తి తన గోదాంలో అక్రమంగా నిల్వ చేసిన 10 బస్తాలు అనగా ఐదుక్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకొని సీజ్‌చేసి చంద్రశేఖర్‌పై కేసునమోదు చేసినట్లు కులకచర్ల ఎస్‌ఐ రమేశ్ తెలిపారు. సీజ్ చేసిన రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లైయ్ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు. ప్రభుత్వం ద్వారా అందించే రేషన్ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేయడం, విక్రయించడం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

### విద్యార్థి ని అదృశ్యం

ధారూరు, మే19: విద్యార్థిని అదృశ్యమైన ఘటన ధారూరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వికారాబాద్ మండల పరిధిలోని గిరిగేట్ పల్లి గ్రామానికి చెందిన వడ్డే సరిత, అంజయ్య కుమార్తె వడ్డే నవనీత (19) శుక్రవారం రాత్రి భోజనం చేసి అందరితో కలిసి నిద్రపో యింది. మరు సటి రోజు ఉదయం లేచి చూడగా ఇంట్లో సరిత కనిపించలేదు, చుట్టుపక్కల, బంధు వుల వద్ద ఆచూకీ లభించకపోవడంతో తల్లిదం డ్రులు పోలీ సులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు

**మరో ఘటనలో వృద్ధుడు..**

ధారూరు, మే 19:ఓ వృద్ధుడు అదృశ్యమైన ఘటన వికారాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సోమవారం వికారాబాద్ పోలీసులు తెలి పిన వివరాలు ఇలా ఉన్నాయి... రాంనాథ్ గూ డుపల్లి గ్రామానికి చెందిన చాకలి పెద్ద నర్సింహులు (75) ఈ నెల 16న శుక్రవారం తన గ్రామం వారి పెండ్లికి వికారాబాద్ పట్టణంలోని నార్సింగ్ ఫంక్షన్ హాల్‌కు వచ్చి తిరిగి రాలేదు. పెండ్లి వద్ద తన పెద్ద కూతూరితో తన చిన్న కూతురు దగ్గరకి పూ డూరుకు వెళ్తానని చెప్పి నార్సింగ్ ఫం క్షన్ హాల్ నుంచి బయలుదేరి ఇప్పటివరకు తన కూతురు దగ్గర గానీ, తిరిగి ఇంటికి గానీ వెళ్లలేదు. పెద్ద నర్సిం హులు కూతురు చాకలి వరమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## నేటి నుంచి టీచర్లకు శిక్షణా కార్యక్రమం

బొంరాస్‌పేట,మే 19: మండల పరిధిలోని ప్రాథమిక, ప్రాథమికోన్నతపాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు మండల కేంద్రంలో మంగళవారం నుంచి శిక్షణా కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల విద్యాధికారి హరిలాల్ తెలిపారు.మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఎస్‌జీటీ, హెచ్‌ఎంలకు మండల కేంద్రంలోని జడ్పీ హెచ్‌ఎస్ పాఠశాలలో ఈ నెల 20 నుంచి 24వ తేదీ వరకు ఐదు రోజులపాటు ఉదయం 9.30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఎఫ్‌ఎల్‌ఎన్ శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ శిక్షణ జీపీఎస్ ట్రాకింగ్‌తో కూడిన లైవ్ లోకేషన్‌తో ఉంటుంది మధ్యాహ్న సమయంలో ఉపాధ్యాయులకు భోజనం ఏర్పాటు చేయడం జరిగిందని ఎంఈఓ తెలిపారు.

## నేడే మోడల్ స్కూల్‌లో ఇంటర్ అడ్మిషన్లకు చివరి రోజు


పూడూరు,మే 19: పదవ తరగతి పాస్ అయిన విద్యార్థులు మోడల్ స్కూల్‌లోని ఇంటర్ మీడియట్‌లో అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం నేడే చివరి రోజు అని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సరళ ఓ ప్రకటనలో తెలిపారు. పూడూరు మండలం వికారాబాద్–మన్నెగూడ రోడ్డు ఎన్కెపల్లి గ్రామ పరిధిలోని మోడల్ స్కూల్, ఇంటర్ మీడియట్ కాలేజీలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీల్లో ఒక్కొక్క క్లాసులో 40 మంది విద్యార్థుల చొప్పున అడ్మిషన్లు పొందే అవకాశం ఉందన్నారు. ఈ కళాశాలల్లో మండల పరిధిలోని గ్రామాల విద్యార్థులే కాకుండా జిల్లాలోని అన్ని మండలాల విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకొని అడ్మిషన్ పొందవచ్చని తెలిపారు. నేడు సాయంత్రం వరకు అడ్మిషన్లకై దరఖాస్తులు చేయవచ్చని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### ప్రతాప్‌రెడ్డి పార్థివదేహం
## గాంధీ మెడికల్ కాలేజీకి అప్పగింత

బన్సీలాల్ పేట్, మే 19 : గాంధీ వైద్య కళాశాల అలుమ్నీ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు డాక్టర్ ప్రతాప్‌రెడ్డి (75) పార్థివ దేహాన్ని వైద్య విద్యార్థుల పరిశోధన కోసం సోమవారం గాంధీ వైద్య కళాశాలకు అప్పగించారు. అంతకు ముందు అలుమ్నీ సెంటర్ హాలులో డాక్టర్ ప్రతాప్ రెడ్డి భౌతికకాయం ప్రజల సందర్శనార్థం పెట్టారు. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుభాశ్ రెడ్డి, కాళోజీ నారాయణ రావు హెల్త్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ నందకుమార్ రెడ్డి, గాంధీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే. ఇందిర, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రవి శేఖర్ రావు, గాంధీ అలుమ్నీ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ జీఆర్ లింగ మూర్తి, కార్యదర్శి ఏవీ రత్నం, జుడా అధ్యక్షుడు డాక్టర్ ఉదయ్ కుమార్ గౌడ్ తదితరులు ప్రతాప్ రెడ్డి భౌతిక కాయానికి నివాళులర్పించారు.

## హోంగార్డు కుటుంబానికిఆర్థిక సాయం

రూ.6.28లక్షల చెక్కు అందచేసిన ట్రాఫిక్ జాయింట్ సీపీ



సిటీబ్యూరో, మే 19 (నమస్తే తెలంగాణ): విధినిర్వహణలో ఉండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందిన హోం గార్డు సింహాచలం కుటుంబానికి సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ డా.గజరావు భూపాల్ రూ.6.28లక్షల చెక్కును అందచేశారు. ఏపీలోని శ్రీకాకుళం ప్రాంతానికి చెందిన సింహాచలం 2007నుంచి పోలీసు శాఖలో హోంగార్డుగా సేవలు అందిస్తున్నాడు. మియాపూర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న సింహాచలం గత నెల 7న విధినిర్వహణలో ఉండగా ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదానికి గురై మృతిచెందాడు. భార్య, ఇద్దరు పిల్లలు ఉన్న సింహాచలానికి అండగా నిలవాలని నిర్ణయించుకున్న సైబరాబాద్ లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ విభాగాల పోలీసులతో పాటు ఇతర అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది కలిసి ఆర్థిక సహాయాన్ని అందచేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ ట్రాఫిక్ డీసీపీ గుణశేఖర్, మియాపూర్ ట్రాఫిక్ ఏసీపీ వెంకటయ్య, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజన వంటపాత్రల పంపిణీ



పరిగి, మే 19: పరిగి నియోజకవర్గంలోని పరిగి, దోమ, కులకచర్ల, పూడూరు, చౌడాపూర్ మండలాల్లోని పాఠశాలలకు మధ్యాహ్న భోజన వంటపాత్రలను సోమవారం పంపిణీ చేశారు. పరిగిలోని మండల విద్యా వనరుల కేంద్రంలో స్థానిక ఎంఈవో గోపాల్ ఆయా మండలాలకు పాఠశాలల వారిగా వంటపాత్రలు అందజేశారు.



బంట్వారం, మే19: కోట్‌పల్లి మండల పరిధిలోని బార్వాద్ గ్రామంలో గ్రామ దేవత భూలక్ష్మమ్మ దేవాలయ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన పెరుమల నర్సింహారెడ్డి అద్వర్యంలో గ్రామస్తులు అమ్మావారి వార్షికోత్సవాన్ని చేపట్టారు. గ్రామస్తులు మహిళలు సాయంత్రం బోనాలతో ఊరేగింపుగా వచ్చి, దూపదీప నైవేద్యాలను సమర్పించారు. గ్రామ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



ధారూరు,మే 19: వికారాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వివిధ ప్రదేశాల్లో ఫోన్‌లను పోగొట్టుకున్న వ్యక్తులు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా సీఐఆర్ యాప్ ద్వారా దొంగలించబడిన మొత్తం 10 ఫోన్లలను రికవరీ చేసి ఫిర్యాదుదారులకు అప్పగించినట్లు, సీఐ భీమ్‌కుమార్ తెలిపారు.

## 77 మంది డీఎస్పీలు బదిలీలు

సిటీబ్యూరో, మే 19(నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా 77 మంది డీఎస్పీలను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో ట్రై కమిషనరేట్ పరిధిలో పలువురు ఏసీపీలను బదిలీ చేశారు. కొంతమంది లాంగ్‌స్టాండింగ్‌లో ఉన్న ఆఫీసర్లకు ఈ బదిలీలలో స్థానచలనం కల్పించింది.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**LEASE REQUIRED**
★సంవత్సరం లీజుకు 10 Acres to 15 Acres భూమి కావాలి. కొత్తూరు, షాద్‌నగర్, తిమ్మాపూర్ పరిసర ప్రాంతాలవారు 15 సంవత్సరాలు సంప్రదించండి: 9182757179
NT-342957

**WANTED**
★త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-336372-All

**LOST**
★I, PATHLAVATH ARAVIND, S/o. P.Kishan, R/o. H.No. 6-18, Venkannaguda Thanda (V), farooqnagar (M), R.R. Dist., have Lost My Original Passport No: W0608048, while travelling for Xerox from Venkannaguda Thanda to Shadnagar. If anyone found pls. Cont: 91 9603649651.
NT-350503

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
Telangana Today
FOR LOCAL TO GLOBAL NEWS
పుట్టినరోజు, పదవీ విరమణ, వార్షికోత్సవ శుభాకాంక్షలు, వర్ధంతి, జయంతి, లీగల్ నోటీసులు మరియు ఇతర ప్రకటనల కొరకు
ఈ దిగువ తెలిపిన నెంబర్లపై సంప్రదించగలరు.
ప్రకటనల విభాగం సెల్: 80966 77655
వికారాబాద్/పరిగి/ శంకర్‌పల్లి, తాండూర్/కొడంగల్ : 80966 77668
ఇబ్రహీంపట్నం/మహేశ్వరం : 80966 77962